క్లుప్తంగా

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో అయోధ్య అక్షింతలను సోమవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ అక్షింతలను పదిరోజుల పాటు స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో తొలుత అక్షింతలను ఊరేగించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50,121 విరాళం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన అగస్త్యరెడ్డి లావణ్య, అగస్త్యరెడ్డి సుధీర్‌రెడ్డి రూ.51,121 విరాళం ఇచ్చారు. వారికి ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించి గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులతో ఆశీర్వచనం ఇప్పించారు. అధికారులు సతీష్‌మాలిక్, నాగభూషణం, రవి, గోపాల్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం



ఏర్పేడు: స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం నిర్మల్‌కుమార్ తెలిపారు. మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారంస్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి విద్యార్థీ క్రమ శిక్షణతో బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ జిల్లా కౌన్సిలర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఓం శక్తిమాల భక్తులకు చేయూత



ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు బీసీ కాలనీలో సోమవారం మేల్‌మరువత్తూరుకు బయలుదేరిన ఓం శక్తిమాల భక్తులకు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి ప్రయాణ ఖర్చులకు నగదు సాయం అందించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు రూ.12 వేలు అందజేసినట్టు పేర్కొన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మునిరత్నం నాయుడు, వెంకటేష్ యాదవ్,మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



ఏర్పేడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్ల గోడలు కూలిపోయి నష్టం వాటిల్లిన బాధితులకు సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన సాయాన్ని పంపిణీ చేశారు. మండలంలోని మేర్లపాక గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాధర్ ఎస్టీకాలనీలో బాధితులకు సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేదల కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏర్పేడు ఎంపీటీసీ భరత్‌కుమార్, వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా భూముల రీసర్వే



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు, భవానీ శంకరపురం, పార్లపల్లి, కంచనపుత్తూరు, చెల్లమాంబపురం గ్రామ రెవెన్యూలలో భూ రీసర్వే శరవేగంగా చేస్తున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు తెలిపారు. భూముల రికార్డులను పక్కాగా సిద్ధం చేసినట్లు చెప్పారు. వైఎస్‌ఆర్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భూముల రీసర్వే ఓ వరమని, రైతులు సహకరించాలన్నారు. తలారివెట్టు గ్రామ రెవెన్యూలో 809 ఎకరాలు, బీఎస్‌పురంలో 691 ఎకరాలు, చెల్లమాంబపురంలో 655 ఎకరాల భూమి ఉందని, కంచనపుత్తూరులో 2 వేల ఎకరాలు, పార్లపల్లిలో 1100 ఎకరాలు సర్వే చేయనున్నట్టు చెప్పారు.

పండుగలా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ



పేదలకు అన్నదానం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి తదితరులు



లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం శ్రీకాళహస్తి పట్టణం, తొట్టంబేడు మండలానికి చెందిన లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుకను పంపిణీ చేశారు. ఇందులో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు రూ.3 వేల పెన్షన్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో అవ్వాతాతల కష్టాలను స్వయంగా చూసి పెన్షన్‌ను దశల వారీగా రూ.3 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందులో భాగంగా సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే రూ.2,250 పెంచుతూ తొలి సంతకం చేశారని తెలిపారు. తర్వాత రూ.2,500, రూ.2,750, ప్రస్తుతం రూ.3 వేలు పెంచామని తెలిపారు. నాడు లబ్ధిదారుడు మరణిస్తేనే కొత్త పెన్షన్ మంజూరయ్యేదన్నారు. నేడు అర్హత ఉన్న వారికి వెంటనే మంజూరవుతోందని వివరించారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా వలంటీర్ ద్వారా ఇంటి వద్దే పెన్షన్ మొత్తం అందజేస్తున్నట్టు తెలిపారు. జగనన్న పేద ప్రజలకు మంచి చేస్తుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని అడ్డంకులు సృష్టిసూ సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నాయని దుయ్యబట్టారు. శ్రీకాళహస్తి పట్టణంలో పేదప్రజలకు సెంటు స్థలం ఇస్తుంటే దాన్ని కూడా రాజకీయం చేసి కడుపులు కొడుతున్నారని ఆరోపించారు. తాను పేద ప్రజల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధమని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా పనిమనిషిలా తాను, తన బిడ్డ ఉన్నామని తెలిపారు.



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

సీఎం కటౌట్‌కు పాలాభిషేకం

ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడంపై లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. బియ్యపు పవిత్రారెడ్డితో కలిసి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరుతారక శ్రీనివాసులు, జనార్ధన్‌రావు పవార్, తొట్టంబేడు మండలాధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, గుమ్మడి బాలకృష్ణయ్య, పట్టణాధ్యక్షుడు పగడాల రాజు, ముత్యాల పార్థసారథి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల అందజేత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సోమవారం వలంటీర్లు వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేశారు. ఆలత్తూరు. కంచనపుత్తూరు, కళ్లివెట్టు, కుక్కంబాకం, పల్లమాల, జీఎన్‌కండ్రిగ గ్రామాల కార్యదర్శులు ఇందిరమ్మ, మునికృష్ణ, శివకుమార్ ఆధ్వర్యంలో 96 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.



తంగెళ్లపురంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

చాలా సంతోషం



నాకు 60 ఏళ్లు దాటాయి. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. అధికారులకు రూపాయి కూడా ఇవ్వలేదు. దరఖాస్తు చేసుకున్న మొదటి విడతలోనే పింఛన్ మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది. గుండె జబ్బు కోసం మందుల ఖర్చులకు ఇబ్బంది పడేదాన్ని. పింఛనుతో ఇబ్బందులు ఉండవు.

–రమణమ్మ, వీఎస్‌పురం

జగన్‌కు రుణపడి ఉంటాం



ఆరు నెలల క్రితం నాభర్త చనిపోయాడు. నాకు దిక్కుతోచలేదు. వలంటీర్‌తో కలసి సచివాలయంలో దరఖాస్తు ఇచ్చాను. ఎవరి సిఫార్సు లేకుండా పింఛన్ వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

–సునీత, కాటూరు

సంక్షేమ పథకాల అమలు జగన్‌కే సాధ్యం

- ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ జగనే సిఎం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- మర్రిమందలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఏర్పేడు : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్యాలెండర్ ప్రకారం అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మర్రిమందలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మురుగు కాలువలు, సిమెంటు రోడ్లు, విద్యుత్ సమస్యలపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలోని 280 కుటుంబాల వద్దకు వెళ్లి వారు పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూరినట్టు తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ జగనన్నే సీఎం అవుతారని చెప్పారు. జనవరి నుంచి అవ్వాతాతలకు రూ.3000 పింఛను అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. అభివృద్ధిని చూచి ఓర్వలేక టీడీపీ, జనసేనలు కలిసి కుట్రలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిశోర్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగరాజరెడ్డి, మునిరాజ, పార్టీ మండల అధ్యక్షుడు రమణయాదవ్, కో ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్, నాయకులు సుధీర్‌కుమార్, మస్తాన్, గోపి, క్రిష్టారెడ్డి, లోకనాథరెడ్డి, గురునాథం, మునిరత్నంనాయుడు, జీపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రూ.లక్ష ఆర్థిక సాయం



రవి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి సోమవారం వారి ఇంటికి చేరుకుని రవి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి భార్య శ్రీవిద్యకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఏ సమస్య వచ్చినా తమను కలవాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ జ్ఞానాంబ మధు, వైఎస్సార్ సీపీ యువత పట్టణాధ్యక్షుడు తలప దామోదర్‌రెడ్డి, రెడ్డి పల్లి మురళి పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రవి, యూనియన్ నాయకులు

సత్యవేడు: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) క్యాలెండర్, డైరీ, వాల్‌పోస్టర్లను ఎంఈఓ కే.రవి ఆవిష్కరించారు. జిల్లా మీడియా కన్వీనర్ జీ.జగదీశ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూనియన్ చురుకైన పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ఏకాంబరం, శివలింగం పాల్గొన్నారు.

వృద్ధులకు ఆశ్రయం కల్పించడం అభినందనీయం



సరోజనమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ఎంతోమంది వృద్ధులకు ఆశ్రయం కల్పించడం అభినందనీయమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులో ఉన్న అమ్మ ఆశ్రమ వ్యవస్థాపకులు సరోజనమ్మ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు ఆశ్రమానికి చేరుకుని ఆమెను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భూలక్ష్మమ్మ, జయంతి, సరస్వతి పాల్గొన్నారు.

సుస్థిరమైన జీవనోపాధి కల్పనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం స్వర్ణలత

సత్యవేడు:సుస్థిరమైన జీవనోపాధుల కల్పన లక్ష్యంగా సాగితే మహిళలు లక్షాధికారులు కాగలరని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం స్వర్ణలత అన్నారు. బుధవారం మధ్యాహ్నం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో లఖపతి దీదీ యోజన యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించి ఏపీఎం మాట్లాడారు. సంఘమిత్రలు సచివాలయ పరిధిలో కుటుంబాల ఆర్థిక, సామాజికంగా వెనుక బడినవారిని గుర్తించి వారి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. నిరుపేదలను గుర్తించే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. వీరి జీవనోపాధులు గుర్తించాలన్నారు. సీసీ పయని, అకౌంటెంట్ నందిని, సంఘమిత్రలు పాల్గొన్నారు.

70 డబుల్స్ విజేత సాయిరాంబాబు

శ్రీకాళహస్తి: పట్టణంలోని విక్రమ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ టోర్నమెంట్‌లో 70 ప్లస్ డబుల్స్ విభాగంలో శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మాజీ డీఎం సాయిరాంబాబు విజేతగా నిలిచారు. ఆయనను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్‌కు వయసుతో సంబంధం లేదన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



సత్యవేడులో భోగిమంట వేస్తున్న విద్యార్థులు



నాగలాపురంలో..

సత్యవేడు: మండలంలోని ఎన్‌టి కండ్రిగలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి విశిష్టత చాటిచెప్పేలా సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అంతకు ముందు భోగిమంటలు వేశారు. హెచ్‌ఎం వెంకటేశులు మాట్లాడారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు ఎం.మునికృష్ణయ్య, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ భవాని, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య సంక్రాంతి ప్రాశస్త్యాన్ని వివరించారు. విద్యార్థులు లఘు నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు, భోగి మంటలు, సంక్రాంతి గొబ్బిళ్లు.. మొదలైనవి ఆకట్టుకున్నాయి.

పాపానాయుడుపేటలో..

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగి మంటలు వేసి గొబ్బెమ్మ పాటలను పాడారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏర్పేడు: భోగి మంటలు

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. శ్రీరామనగర్‌కాలనీలోని చైతన్య పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ రూపాదేవి విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించారు. ఏజీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సెయింట్ జేవీఆర్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షెర్లీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాలతో సేవలు చేరువ



సచివాలయ నూతన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పునరుద్ఘాటించారు. సోమవారం మండలంలోని అరణ్యంకండ్రిగ గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు పథకాలు పొందాలన్నా, ఇతరత్రా వాటి కోసం జన్మభూమి కమిటీ సభ్యుల దయాదాక్షిణ్యాల కోసం ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి లేదన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ ఇళ్ల ముంగిటకే అన్ని సేవలను తమ ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మరోసారి తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

స్థలదాతకు సన్మానం

సచివాలయ భవన నిర్మాణానికి స్థలదానం చేసిన డాక్టర్ రామచంద్రన్‌ను ఎమ్మెల్యే శాలువ కప్పి, పూలమాలతో సత్కరించారు, కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పీఆర్ డీఈ మధుసూదన్, పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, సర్పంచులు రత్న, సాయిరవి, ధర్మలింగం, ఎంపీటీసీ సభ్యులు చెంచమ్మ, రవి, మండల పరిషత్ ఏవో గుణశేఖర్, పార్టీ నాయకులు భాస్కర్, మురళి, సుబ్రమణ్యం, రాజారెడ్డి, ఊరప్ప, అన్నాదొరై, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ

కేవీబీపురం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 50 మందికి పైగా వివిధ గ్రామాల వారు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రాలు ఇచ్చారు. తనకు చెందిన సెటిల్‌మెంట్ పట్టా భూమిని రెవెన్యూ అధికారులు గుట్టుగా వేరొకరి పేరుపై మార్చేసారని, దీనిపై తనకు న్యాయం చేయాలని రాయపేడుకు చెందిన రాసా కోరాడు. అలాగే తమ భూములకు పాసు పుస్తకాలు ఇవ్వాలని వేమళ్ళపూడి, ఆదవరం గ్రామాలకు చెందిన రైతులు 30కి పైగా వినతులు ఇచ్చారు. మండల కేంద్రంలోని గిరిజన కాలనీకి చెందిన నాలుగు ఎకరాల భూమిని గ్రామస్తుడొకరు చదును చేసి తమ కుటుంబాలకు స్థలం లేకుండా చేస్తున్నా రని, చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ గిరిజన కాలనీవాసులు వినతిపత్రాన్ని ఇచ్చారు. పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

ఏర్పేడు: పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించడంతో పాటు ఆదాయం పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త దివ్య తెలిపారు. పాపానాయుడుపేటలోని రాస్ మహిళా భారతి సేవా నిలయంలో సోమవారం రైతులకు రుణమేళా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొలంలో దుక్కులు దున్నే సమయంలో లోతుగా దున్నడం వల్ల మొక్కల వేర్లు భూమిలోకి ఎక్కువగా పోతాయన్నారు. యంత్రాల ద్వారా వరినాట్లు వేసుకోవడం మంచిదన్నారు. వానపాముల పెంపకం, వర్మీకంపోస్టు ఎరువుల తయారీ గురించి వివరించారు. కేవీకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రోన్ ద్వారా మందుల పిచికారీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 76 మంది రైతులకు రూ.28.5 లక్షల రుణాలు అందజేశారు. ప్రాజెక్టు అధికారి బాలాజీ రెడ్డి, వెంకటకుమార్, మునీంద్ర, హేమలత, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాస్ కేవీకే శాస్త్రవేత్త దివ్య

రైతులపై కక్ష పూరిత చర్యలు శోచనీయం

- అటవీ అధికారులతో మండల అధికారులు, నేతల చర్చ

కేవీబీపురం: మండలంలోని వేమళ్ళపూడి, కొండల్లో ఆదవరం గ్రామాల రైతులపై అటవీ అధికారులు కక్ష పూరిత చర్యలకు పాల్పడడం దారుణమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వేమళ్ళపూడి, ఆదవరం రెవెన్యూలోని సర్వేనెంబర్ 194–బి,195–ఏ లోని సుమారు 8 ఎకరాల సెటిల్ మెంట్ పట్టా భూమికి 1952లో పట్టా మంజూరు చేసినప్పటికీ 22 ఏళ్ల క్రితం తీసుకొచ్చిన ఫారెస్ట్ యాక్ట్ ప్రయోగించి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సుమారు 70 ఏళ్లుగా సాగులో ఉన్న భూములను రిజర్వ్ ఫారెస్ట్ భూమిగా పరిగణిస్తూ ఆ రైతులను భూముల్లోకి రానీయకుండా అడ్డుకుంటున్నారని ఆయన రైతులతో కలిసి సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ శ్రీదేవి, ఫారెస్ట్ అధికారులను తన కార్యాలయానికి పిలిపించి చర్చించారు. తమ గైడ్ లైన్స్ ప్రకారం పక్కా రిజర్వ్ ఫారెస్ట్ అని తెలిసి కూడా రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారని, ఆ కారణంగానే రైతులు నష్టపోతున్నారని శ్రీకాళహస్తి ఎఫ్‌ఆర్‌ఓ లోకేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మధుసూదన్ యాదవ్, డీటీ మునిరత్నం, ఆర్‌ఐ సుబ్రమణ్యం, మండల సర్వేయర్ మురళి పాల్గొన్నారు.



ఫారెస్ట్ అధికారులతో చర్చిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

భోగేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా నందీశ్వరుని ప్రతిష్ట

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన భోగేశ్వరాలయంలో సోమవారం నంది ప్రతిష్ఠ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురాతన చరిత్ర కలిగిన ఇక్కడి భోగేశ్వరాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన అరుణ్‌ఫణి అరుల్‌కట్టడై ట్రస్టు ఇక్కడి ఆలయంలో నంది విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ముందుకొచ్చింది. ఇందులో భాగంగా ట్రస్టు ప్రతినిధులు శివశంకర్, శివ నాయనర్, పచ్చయప్పన్ పూజల అనంతరం నంది విగ్రహాన్ని ప్రతిష్టించారు. వారు మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో దేశంలో 703 ఆలయాల నిర్మాణం చేపట్టినట్టు పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి ఆలయంగా పేరుగాంచిన ఉత్తర కొసమంగైలోని మరకత నటరాజర్ ఆలయాన్ని ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించినట్టు వివరించారు. ఏపీలో మొట్టమొదటగా ఇక్కడి భోగేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. నంది విగ్రహం ప్రతిష్ట సందర్భంగా ట్రస్టు ఆధ్వర్యంలో రేకుల షెడ్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా భోగేశ్వరస్వామి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.



నంది ప్రతిష్టలో ట్రస్టు సభ్యులు, భక్తులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌వై గిరిజనకాలనీలో అక్రమ నిర్మాణాలు ఎక్కువవుతున్నాయని, వాటిని కట్టడి చేయాలని స్థానిక గిరిజనులు సోమవారం తహసీల్దార్ గౌరిశంకరరావును కోరారు. రాత్రికి రాత్రే అక్రమంగా ఇళ్ల నిర్మాణానికి పూనుకుంటున్నారని, తమకు కేటాయించిన భూములను సైతం దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని, అలాగే స్థానికంగా అంబేడ్కర్ భవన్, ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాలను సైతం దర్జాగా ఆక్రమిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని నిరసించారు. దీనిపై తహసీల్దార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో ఆర్‌ఐ వేణుగోపాల్, వీఆర్వో చలపతి కాలనీకి వెళ్లి పరిశీలించారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించి తహసీల్దార్‌కు నివేదించారు.



వీకేఆర్‌వై కాలనీలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్‌ఐ వేణుగోపాల్

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

పిచ్చాటూరు: ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమవారం రామాపురంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు కె.గంగాధరం, వ్యవసాయ శాఖ ఏడీ జె.సుబ్రమణ్యం, ఏఓ సంజీవ రెడ్డితో కలిసి వెంగళత్తూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యవసాయ క్షేత్రంలో శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, వేపనూనె తయారీ, ప్రకృతి వ్యవసాయం వల్ల మానవాళికి, పంట పండించే నేలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రసాయన ఎరువుల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలియజేశారు. హెచ్‌ఎం ఈశ్వర్ రెడ్డి, టీచర్లు హరిప్రసాద్, దినకర్ బాబు, డాక్టర్ పాండురంగశెట్టి, తులసీరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

